# ఏదీ రాధ?

రచన:
"శ్రీమతి స్వరాజ్యలక్ష్మి"

(గతసంచిక తరువాయి)

"ఒక్క నిముషం కూర్చోండి ....... రంగన్నా!"

"అయ్యా".

"రెండు కాఫీలు పట్రా" అహఁ, ఎందుకండి. నే వెళ్తాను. "అంటూ మొహమాటపడింది. ముఖపరిచయంలోనే ఇంతగా మాట్లాడుకున్నాం. కనీసం కాఫీ అయినా..."

సిగ్గుపడింది రాధ.

కాఫీ త్రాగడం పూర్తయ్యింది. "వస్తానండీ..."

"మళ్ళీ కలుస్తారా" ఆశ.

"టైం లేదు కదండి"

"మీ ఇష్టం" నిరాశ.

"వస్తాను...మీ రాకకై ఎదురుచూస్తుంటాను" అంటూ చిలిపిగా చూస్తూ ఒక అందమైన నవ్వు చివరిసారిగా విసిరి చేతులు సుతారంగా ఊపుతూ వెళ్ళిపోయిన రాధ వంక అచేతనంగా చూస్తుండిపోయాడు.

ఉలిక్కిపడ్డాడు. తన చేతిలో ఏదో ఉన్నట్లనిపించింది చూసాడు ఫోటో.

"ఇందులో ఉన్న మాధవి కోసం కాకపోయినా ఆ రాధను మరొక్కసారి కనులారా చూసేభాగ్యం కల్గించుకోవడానికైనా వెళ్ళాలి తప్పకుండా వెళ్ళాలి" అనుకుంటూండగానే అప్రయత్నంగా హరీష్ చేయి ఫోటోతో సహా పెదవులపైకి వెళ్ళి అతని ఒళ్ళు పులకరింపుకు కారణమైంది.

♦ ♦ ♦

ఆరోజు ఆదివారం, మాధవి ఇల్లు.

వేకువనే లేచి పనులు చేయసాగారు. మాధవికి తలంటుపోసి పూలజడ వేసి ఆమె అందానికి మరింత మెరుగు దిద్దారు. ఇంటిని కూడా అందంగా అలంకరించారు. మాధవి మూలమూలనా ఫ్లవర్ వాజెస్ క్రొత్త క్రొత్తపూలతో నింపిపెట్టింది. పనివాళ్ళు ఇల్లు శుభ్రంగా కడిగి తుడిచి హాలుమధ్య మెత్తని సోఫాలు అందంగా అమర్చిపెట్టారు.

ఉదయం పది గంటలకల్లా పనులు పూర్తి చేసుకుని వచ్చేవారి కొరకు ఎదురుచూడసాగారు. పదకొండు గంటలవరకు సరిగ్గా వారు ఇంట్లో అడుగుపెట్టారు. మాధవి లోపలేఉంది.

అందరూ ఆసీనులయి కబుర్లలో దిగారు, హరీష్ మౌనం దాల్చాడు.

"అమ్మాయిని తీసుకురండి" అన్నాడు హరీష్ తండ్రి ప్రసాదరావు.

కొంతసేపటికి సిగ్గుపడుతున్న మాధవిని తీసుకువచ్చి మాధవి తల్లి ప్రక్కనే సోఫాలో కూర్చోబెట్టారు.

హరీష్ తలెత్తి చూశాడు.

"మాధవి అచ్చు రాధలాగే ఉందే రాధను గానీ కూర్చోబెట్టలేదు కదా మరి రాధ కన్పించదేమిటి?" అనుకుంటూ చుట్టుప్రక్కల పరిశీలించాడు ఊహుఁ, కన్పించలేదు.

అతని మనసంతా రాధ మయమైపోయింది. అతని కళ్ళలో రాధే నాట్యం చేస్తోంది. మాధవిని చూడడటానికికూడా మన సంగీకరించలేదు

అతని తలిదండ్రులు మాధవిని వంటొచ్చా పాటలొచ్చా అంటూ ఇంకా యేమేమో అడుగుతున్నారు. ఆమె సంతృప్తికరంగా సమాధానాలిస్తోంది. కానీ అదే ఆ రాధ కంఠమే ఈ మాధవి నోటిగుండా తీయగా వినపడుతోంది.

"రాధ- ఏదీ తనమనసుని దొంగిలించుకుపోయిన ఆరాధయేది? కన్పించదే." అనుకుంటూ ఎదని భారంగా మలచుకుంటూ మర్యాదకొరకు కొన్ని గంటలసేపు ఉండాలి గాబట్టి ఉన్నాడు.

మా మాధవి చేసిందంటూ ఇచ్చిన స్వీట్ హాట్ ఆప్యాయంగా తిని ఆమెకు వంటలోగల నేర్పును చూసి ఆనందించారంతా.

హరీష్ కూడా మనస్సులో శ్లాఘించకుండా ఉండలేకపోయాడు. "అమ్మాయి సంగతి తెలుసుకోండి. అబ్బాయినడిగి తెలుసుకుని వెళ్ళిన తర్వాత ఉత్తరం వ్రాస్తాం" అన్నారు వాళ్ళు.

కార్యక్రమం నిరాటంకంగా ముగిసింది.

§ § §

అది కాదమ్మా! నేను చెప్పేది కాస్తవినండి, బాగా వినండి. ప్రకాశంగారికి రాధమాధవి అని ఇద్దరు కూతుళ్ళున్నారు. రాధకు పెళ్ళిచేసుకోవాలని లేదుట. కాని_ నేను మాత్రం ఆమెను తప్ప ఎవరినీ చేసుకోదలచుకోలేదు. మీ వల్లనైతే నా ఇష్టాన్ని తెలుసుకుని చేయగలిగింది చేయండి''

"నువ్వనుకుంటే సరిపోయిందా మేంలేమూ ఆలోచించటానికి, మాకు ఆపిల్ల నచ్చిదింది. అయినా ఆమ్మాయిలో ఏం లోటు కనిపించింది నీకు? అందం ఐశ్వర్యం, అన్నిటినీ మించిన సుగుణం. ఆ అమ్మాయిని మా కోడలుగా చేసుకుంటామని ఉత్తరం కూడా వ్రాశాను. మా మాట కాదనడానికి వీల్లేదు''.

ఖచ్చితంగా అన్నాడు ప్రసాదరావు.

"నాన్నా!... పెళ్ళి చేసుకునేది నేను నాన్నా. నాకిష్టమయిన అమ్మాయిని చేసుకుంటాను. అయినా నా సంప్రదింపు లేకుండా ఉత్తరం వ్రాశారేం? ఏ సుగుణాల రాశిని తెచ్చినా నా మనంగీకరించే స్థితిలో లేదు. మీ మనసుకు కష్టం కల్గిస్తే క్షమించండి. నేననుకున్నట్లు ఎప్పటికైనా జరుగుతుందనే ఆశఉంది. నన్ను మాత్రం బాధపెట్టకండి'' అంటూ తన రూంలోకి చరచరా వెళ్ళిపోయాడు హరీష్.

ప్రసాదరావు నిర్ఘాంతపోయాడు.

"హుం కాలంతీరు మనుషులు'' అంటూ గాఢంగా నిట్టూర్చింది రామలక్ష్మి.

♦ ♦ ♦

కుమారుడి మొండి పట్టుదల తెలిసిన ప్రసాదరావుగారు ప్రకాశంగారికి ఉత్తరం వ్రాయ నుపక్రమించారు.

"రాధ మరి ఈ పెళ్ళికి ఒప్పుకుంటుందో లేదో? ఒకవేళ అలా జరగక పోతే తెలిసిందేగా వీడిపట్టు! ఒక్క_గానొక్క_ కుమారుడు? వీడి పెళ్ళి వైభవంగా జరిపిద్దామని ఎన్ని కలలు కన్నామోకదా! ఎలాగౌతుందో ఏమిటో!'' ఆ తల్లిదండ్రులకు మనశ్శాంతి దూరమైంది.

♦ ♦ ♦

TRADE MARK
Panju TEX
మన్నికకు, అహ్లాదానికి...
పంజు టెక్స్ వారి
* మాస్టర్ * ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

గౌరవనీయులైన ప్రకాశంగారికి,

నమస్కారములు.

మీకు ఇద్దరు కుమార్తెలని మాటవరసకైనా మాతో చెప్పని మీ ఉద్దేశ్యం ఏమిటో తెలియడం లేదు. పెద్దమ్మాయి రాధ పెళ్ళి చేసుకోదలచుకోలేదట. పైచదువులపై కోరిక ఉన్నట్లు తెలిసినది.

మీ అమ్మాయి రాధకు ఎంతగా ఇష్టమైనంతవరకు మేము చదివించగలము. మొన్న బుధవారంనాడు రాధే వచ్చి ఈ విషయాలన్నీ చెప్పిందిట. మా బాబూ ఆ అమ్మాయిని తప్పితే మరే అమ్మాయినీ కాదు పెళ్ళి చేసుకోనంటున్నాడు. దయచేసి మీ రాధమ్మని సంప్రదించగలరని, ఆశిస్తున్నాము.

ఇట్లు,
ప్రసాదరావు.

ఆశ్చర్యపోయారు ప్రకాశరావుగారు.

అలాగే కవరను చేతబట్టుకుని, "ఒసే పారూ!... పారూ!..''

అంటూ గట్టిగా కేకలు వేయసాగారు.

"అబ్బబ్బ!! ఏమిటండీ పారూ అంటూ ఎంచక్కా_ పార్వతీ అని పిలువరాదూ'' అంటూ కొంగుకు చేతులు తుడుచుకుంటూ ఇంట్లోంచి వరండాలోకి వచ్చింది పార్వతమ్మ.

"నీకు ముక్కు_ మీదే కోపం పారూ! అరెరె... మళ్ళీసిగ్గా. బలే! ఈ వయాసులో మరీ అందంగా కన్పించేస్తున్నావు'' అంటూ నవ్వుతూంటే_

"చాల్లెండి. ఎవరేనా వింటే నవ్వుగలరు ఇంతకూ ఎందుకుపిలిచినట్లు'' కంఠంలోకి గంభీరతతో అడిగింది పార్వతి.

ముసిముసిగా నవ్వుకుంటూనే_

"ఇదిగో వారి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది చూడు" అంటూ కవరందించ బోయాడు.

"ఏమండీ ... నన్నెందుకిలా ఎప్పుడూ ఎగతాళిగా సతాయిస్తారు. నేను సంతోషంగా ఉండడం మీకిష్టం లేదా" అందిబాధగా.

"ఛ! పిచ్చిదానా !! ఏదో సరదాకి చదవమని ఇస్తే ఇంతగా బాధ పడాలా? నీకు చదువురాదని తెలిసే నిన్ను పెళ్ళాడాను తెలుసా?"

ఇంకా భార్య ముఖంలోకి ప్రసన్నత కనిపించక పోయేసరికి, "పార్వతీ? నువ్వలా ఉంటే నేను భరించ లేను ఇటు చూడు! ఇంకెప్పుడూ ఇలా నీ మనసు బాధ పెట్టను. సరేనా? మరి ఉత్తరం చదువుతున్నాను విను" అంటూ చదివి వినిపించారు ప్రకాశంగారు.

"ఇదేం విచిత్రమండీ...మనకున్నదీ ఒక మాధవయితే మధ్యలో రాధెక్కడిదండీ" అంది అమితాశ్చర్యంతో.

"అదేనాకూ ఆశ్చర్యంగా ఉంది. పోనీ మాధవి బుధవారంరోజు ఎక్కడికేనా వెళ్ళిందా?" సాలోచనగా అడిచారు.

"అవును దాని స్నేహితురాలు పెళ్ళికని వెళ్ళింది?" ప్రశార్థకంగా చూసింది. (సశేషం)

★

"ప్రెసిడెంటు పేరమ్మ"

ప్రసిద్ధ దర్శకుడు శ్రీ కె. విశ్వనాథ్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత శ్రీ డి. వి. యస్. రాజు కవితాఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్న వినోద వల్లరి "ప్రెసిడెంటు పేరమ్మ' ఈస్ట్‌మన్ కలర్ చిత్ర నిర్మాణం పూర్తి చేసుకొని ఏప్రిల్ 12వ తేదీన విడుదలయ్యేందుకు సంసిద్ధంగా వుంది.

నేడు సమకాలీన గ్రామీణ రాజకీయ జీవితాన్ని ప్రతిబింబించే యీ పూర్తి వినోదాత్మక చిత్రంలో నూతన్ ప్రసాద్, కుమారి కవిత, నాయకా, నాయికలుగా తొలి సారి పరిచయంకావటం ఒక ముఖ్యవిశేషం.

చలిచీమలు చిత్రం తర్వాత ఆచిరకాలంలోనే ఆంధ్రప్రేక్షకుల అభిమానాన్ని చూరకొన్న నూతన్ ప్రసాద్ పాత్రను దర్శకులు శ్రీ కె. విశ్వనాథ్ అపురూపంగా రూపుదిద్దారు.

శ్రీ దాసం గోపాలకృష్ణ, కథమాటలు, సమకూర్చిన యీ రసవత్తర చిత్రంలో గోకిన రామారావు, రాజ్‌బాబు, కె. పి. చలం, రమణమూర్తి, సి. హెచ్. కృష్ణమూర్తి, అప్పారావు, సుబ్బారావు, సూర్యచంద్రరావు, రమాప్రభ, మంజుభార్గవి, జానకి; మొదలగువారు నటించారు.

ఛాయాగ్రహణం: జి. కె. రాము, సంగీతం: చక్రవర్తి, కూర్పు: జి. జి. కృష్ణారావు, కళ: కళాధర్, కో డైరక్టర్: పి. వి. రామారావు, సహకార దర్శకత్వం నందూరివిజయ్.

నూతన్ ప్రసాద్ :_ "ప్రెసిడెంట్ పేరమ్మ"లో తన పాత్ర గురించి నూతన్ ప్రసాద్ మాట్లాడుతూ చలిచీమల చిత్రం తర్వాత మద్రాసుకు మకాం మార్చిన తొలిరోజుల్లో శ్రీ డి. వి. యస్. రాజుగారు వారి కార్యాలయానికి పిలిపించి "ప్రెసిడెంటు పేరమ్మ" కథానాయకుని పాత్ర యిస్తున్నామని చెప్పినప్పుడు నాఆనందానికి అంతు లేదు. డి. వి. యస్. సంస్థలో శ్రీ విశ్వనాథ్ గారి దర్శకత్వంలో కథానాయకుని పాత్ర చిత్రీకరణకు శ్రీ విశ్వనాథ్ గారు ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. ముఖ్యంగా క్లైమాక్స్ పాట చిత్రీకరించేటప్పుడు శారీరకంగా ఎంతో కష్టానికోర్చి నటించాల్సివచ్చింది తర్వాత వారం రోజులు సరిగా నడవలేకపోయాను. నేను ఎందుకు నడవలేక పోయాను అనేది ఆ చిత్రం చూసాక మీకే తెలుస్తుంది. ఏది ఏమయినా 'ప్రెసిడెంటు పేరమ్మ' చిత్రంలో నా పాత్రను ఒక పెద్ద పరీక్షగా ఎదుర్కొన్నాను. కష్టం ఎప్పుడూ వూరక పోదు కనుక ప్రేక్షకుల ఆశీస్సులతో యీ పరీక్షలో ఫస్ట్‌క్లాస్‌లో పాసవుతాననే నమ్మకం నాకు బాగావుంది అని అన్నారు. నూతన్ ప్రసాద్.

కవిత అభిప్రాయం: "ప్రెసిడెంటు పేరమ్మ"లో నేను నటించిన టైటలు పాత్ర నా నటనాజీవితంలో మరపురాని పాత్ర అని అన్నారు కథానాయికగా నటించిన కుమారి కవిత. యీ చిత్రం ప్రతి ఫ్రేములోను దర్శకులు శ్రీ విశ్వనాథ్ గారు తీసుకొన్న శ్రద్ధ తనను తీర్చి దిద్దటంలో వారు పడ్డ కృషి, ప్రేక్షకుల ఆశీర్వాదాలు తప్పక పొందుతాననే ధైర్యం నాకుంది. ఈ చిత్రంలో యీ పాత్ర నటించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు కుమారి కవిత.